క్లుప్తంగా

దోమలమందు పిచికారీ



గొర్రిపూడిలో నీరు నిల్వ ఉన్న ప్రదేశంలో ఆయిల్ బాల్స్ వదులుతున్న సిబ్బంది

కరప: మండల పరిధిలో ఎంపీడీఓ కర్రె స్వప్న ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనుల డ్రైవ్‌లో భాగంగా సోమవారం గ్రామ, గ్రామాన డ్రెయిన్లలో యాంటి లార్వల్(దోమల మందు) పిచికారీ చేయించారు. . కరప, గొర్రిపూడి, కొంగోడు, కూరాడ, జి.భావారం, వేళంగి, యండమూరు తదితర గ్రామాల్లో శానిటేషన్ పనులు నిర్వహించి, డ్రెయిన్లు, కచ్చా డ్రెయిన్లలో దోమలువ్యాప్తి చెందకుండా ఎబేట్‌మందును పిచికారీ చేశారు. నీరు తొలగించేందుకు అవకాశంలేని ప్రదేశాల్లో, కుంటలలో ఆయిల్ బాల్స్ వదిలారు. సాయంత్రం సమయంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు ఆయా గ్రామసర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, కె.రమాదేవి, వాసంశెట్టి కొండ, రొక్కాల గణేష్, సవిలే నీలిమ, మార్నెళ్ల శివ ఆయా గ్రామకార్యదర్శులతో కల్సి దోమలనివారణ చర్యలను పర్యవేక్షించారు.

ఘనంగా అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం



ప్రసంగిస్తున్న న్యాయవాది రవిశంకర్

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ కుటుంబాలు సమాజానికి పునాది వంటివన్నారు. 1994నుంచి మే 15న అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి తీర్మానించిందన్నారు.

వెంకన్నబాబు ఆలయంలో శాంతి కల్యాణం



యండమూరు వెంకన్నబాబు ఆలయంలో శాంతి కల్యాణం జరుపుతున్న పండితులు

కరప: మండలం యండమూరులో వేంచేసి ఉన్న సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శాంతి కల్యాణం నిర్వహించారు. వైశాఖమాసం బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఈ కల్యాణ క్రతువును నిర్వహించినట్టు ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం తెలిపారు. భక్తులు శ్రీనివాసు, ఏడుకొండలు, నాగేశ్వరరావుల దంపతులతో వేదపండితులు మంత్రోచ్చారణలతో స్వామివారికి శాంతి కల్యాణం జరిపారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

కాకినాడ రూరల్: మండలంలోని రేపూరులో శ్మశాన వాటికకు సిమెంట్ రోడ్డుతో పాటు గ్రామంలోని వివిధ ప్రాంతాలలో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్ నిధులు రూ.24 లక్షలతో చేపటనున్న పనులకు సంబంధించి ఎమ్మెల్యే కన్నబాబు కొబ్బరి కాయ కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల అభ్యర్థన మేరకు శ్మశాన వాటికతో పాటు పలు రోడ్లను నిర్మిస్తున్నామని, అభివృద్ధి పనులు వేగవంతం చేశామన్నారు. గ్రామ సర్పంచ్ నక్కా వీరన్న, ఎంపీటీసీ సభ్యులు మామిడాల నాగ చక్రం పాల్గొన్నారు.

వేగంగా టిడ్కో పనులు

కాకినాడ: టిడ్కో ప్రాంగణంలో మౌలిక సదుపాయాలను వేగవంతం చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఆదేశించారు. టిడ్కో గృహనిర్మాణ ప్రగతిపై సోమవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. కాకినాడ పర్లోపేట ప్రాంతంలో 2056 టిడ్కో ఇళ్లకు సంబంధించి తొలి విడత 1,152 ఇళ్లను అప్పగించేందుకు ఇప్పటికే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా పూర్తి చేశామన్నారు. టిడ్కో ఇళ్ల ప్రాంగణంలో రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సదుపాయం, ఎలివేషన్ రిజర్వాయర్లు, ఎస్‌టీపీ ప్లాంట్, ఇతర సదుపాయాల కల్పన కోసం రూ.15 కోట్లతో ప్రతిపాదించిన పనులన్నీ మరింత వేగవంతం కావాలన్నారు. తొలి విడత అప్పగించే ఇళ్లకు సంబంధించి 855 ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన రిజిస్ట్రేషన్లతోపాటు, బ్యాంక్ మార్ట్‌గేజ్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమంగా ఉన్న టిడ్కో ఇళ్ల విషయంలో ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. టిడ్కో ఈఈ రీటా, టీపీఆర్వో మానేకృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఏసీలకు పెరిగిన గిరాకీ

- వడగాడ్పులతో జనం బెంబేలు
- షాపుల వద్ద క్యూకడుతున్న వైనం



ఒక షోరూమ్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఏసీలు

బోట్‌క్లబ్: భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాకినాడ నగరంలో రోజురోజుకి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ప్రజలు వేడితాపానికి తట్టుకొనలేకపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచి వేడిగాలులు మొదలు అవుతున్నాయి. ఇంటిలో ఫ్యాన్‌లు వేసుకున్నా వేడిగాలులు తప్పడం లేదు. దీంతో ఏసీ (ఎయిర్ కండిషన్స్)ల కోసం ప్రజలు షోరూమ్‌లకు క్యూ కడుతున్నారు. కాకినాడ నగరంలో సోమవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఉదయం మొదలైన వేడి గాలులు సాయంత్రమైనా తగ్గకపోవడంతో సాధారణ, మధ్యతరగతి ప్రజలు సైతం ఇంటిలో ఉండలేక ఏసీ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కసారిగా ప్రజలు ఏసీలు కొనుగోలు చేసేందుకు రావడంతో షాపుల యజమానులు అదును చూసి రేట్లు కూడా పెంచుతున్నారు. దీపం ఉండగా ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా డిమాండ్ ఉండడంతో రేట్లు పెంచుతున్నారు. ఎండాకాలంలో ఫుల్‌గా స్టాక్ పెట్టుకున్నా డిమాండ్ ఉండడంతో అధిక రేట్లకు విక్రయించేందుకు స్టాక్ లేదని కొందరు వ్యాపారులు ఇదే అదునుగా ప్రజలను దోచుకుంటున్నారు. కాకినాడ నగరంలో 10 పెద్ద షోరూమ్‌లు, 40కి పైగా చిన్న ఏసీ షోరూమ్‌లు ఉన్నాయి. పెద్ద షోరూమ్‌లో ప్రతీ రోజు 15 నుంచి 20 వరకూ ఏసీలు, చిన్న షోరూమ్‌లో 10 నుంచి 15 వరకూ ఏసీలు అమ్ముడైపోతున్నాయంటే ప్రస్తుతం ఎండ వేడి ఎలా ఉందో వేరే చెప్పనవరం లేదు. ఈ నెల మొదటి వారంలో కాకినాడ నగరంలోని అన్ని షోరూమ్‌లో కలిపి 100 నుంచి 120 ఏసీలు మాత్రమే విక్రయించారు. ప్రస్తుతం 500 నుంచి 600 ఏసీలు విక్రయిస్తున్నారు.

సాధారణ మధ్య తరగతి ప్రజలు సైతం

ఒక్కప్పుడు ధనవంతులు మాత్రమే ఏసీలు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం సులభ వాయిదా పద్ధతులను షోరూమ్‌లు ఇవ్వడంతో సాధారణ మధ్య తరగతి ప్రజలు సైతం ఏసీలు కొనుగోలు చేసుకొంటున్నారు. దీంతో విక్రయాలు అనుకున్న దానికన్నా ఎక్కువగా ఉండడంతో షోరూమ్ యజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టెక్నీషియన్‌లకు పెరిగిన డిమాండ్

వేల రూపాయిలు పెట్టి ఏసీ కొనుగోలు చేసినా వాటిని ఏషీ టెక్నిషియన్ వచ్చి ఇంటి వద్ద బిగించాలి. రోజుకి వందల కొద్దీ ఏసీలు విక్రయిస్తున్న షోరూమ్‌ల యజమానులు వాటిని బిగించేందుకు టెక్నీషియన్‌లు దొరకకపోవడంతో తలలు పట్టుకొంటున్నారు. ఏసీలు కొనుగోలు చేసిన వారు అదే రోజు మాకు ఏసీ బిగించాలని పట్టుబట్టడంతో టెక్నీషియన్‌లకు గిరాకీ పెరిగింది. సాధారణ రోజుల్లో రూ.500 ఇస్తే ఏసీ బిగించే టెక్నీషియన్ ప్రస్తుతం రూ.వెయ్యి డిమాండ్ చేస్తున్నారు.

వేడి తట్టుకోలేకపోతున్నాం



ఈ ఏడాది ఏసీ కొనుగోలు చేద్దామనుకున్నాను. కానీ డబ్బులు లేకపోవడంతో వచ్చే ఏడాది డబ్బులు పోగుచేసుకొని కొందామనుకున్నాను. కానీ వేడిగాలులు ఎక్కువైపోయాయి. నేనే ఒక ఆసుపత్రిలో పనిచేస్తున్నాను. రాత్రి ఇంటికొచ్చి పడుకున్నా ఫ్యాన్ గాలి వేడిగా రావడంతో నిద్ర పట్టడం లేదు. తప్పని పరిస్థితుల్లో ఫైనాన్స్ మీద ఏసీ కొనుగోలు చేశాను.

– దడాల చంద్రరావు, ఏసీ వినియోగదారుడు

పశువులు, శునకాల లెక్కింపునకు సర్వే

కాకినాడ: నగరంలో సంచరిస్తోన్న శునకాలు, పశువుల సంఖ్యను లెక్కించేందుకు సర్వే చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఈ అంశంపై నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం, పశు సంవర్ధకశాఖ, సంబంధిత వర్గాలతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్ని శునకాలు ఉన్నాయి? ఎన్నింటికి ఏబీసీ ఆపరేషన్లు చేశారు? ఇంకా ఎన్ని చేయాలి? నగరం మొత్తంమీద ఎన్ని పశువులు ఉన్నాయి? అనే అంశంపై స్పష్టమైన సమాచారాన్ని సేకరించాలన్నారు. లెక్కించే విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 18, 19 తేదీలలో నగరంలోని సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, జంతు ప్రేమికులు, ఆయా సంస్థలు, వర్గాలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం 20వ తేదీన వీటి లెక్కింపు ప్రక్రియ చేపడతామన్నారు. సంఖ్య నిర్ధారణ అయ్యాక వీటిని నియంత్రించే అంశంపై ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ సూర్యప్రకాశరావు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ రామయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, స్నేప్ సంస్థ ప్రతినిధి శ్యామ్, మైత్రేయి సంస్థ ప్రతినిధి చెక్కా సుశీ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

కాకినాడ సిటీ: యు.కొత్తపల్లి మండలం కొమరిగిరి లేఅవుట్‌లో కొమరిగిరి గ్రామ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆ గ్రామ మహిళలు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. జగనన్న కాలనీ పేరిట కొమరిగిరి గ్రామానికి చేర్చి సుమారు 340 ఎకరాల లేఅవుట్‌లో 50 వేల మంది కాకినాడ నగరానికి చెందిన పేద ప్రజలకు ఇంటి స్థలాలు ఇచ్చారన్నారు. వారితోపాటు తమ గ్రామానికి చెందిన సుమారు 287 మందికి అక్కడ ఇంటి స్థలాలు మంజూరు కాగా వారిలో 150 మందికి మాత్రమే ఇచ్చారన్నారు. మిగిలిన లబ్ధిదారులకు ఇప్పటికీ స్థలాలు ఇవ్వలేదన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే కన్నబాబు



పి.వెంకటాపురంలో ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: తాగునీటి సరఫరాకు కాకినాడ రూరల్ నియోజవర్గంలో అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. జల జీవన్ మిషన్ పథకం కింద మండలంలోని మూడు గ్రామాలలో రూ.1.68 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. తొలుత నేమాం ఎల్విన్‌పేటలో రూ.53.25 కోట్లతో ఓవర్ హెడ్‌ట్యాంకు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పెనుమర్తిలో రూ.55.86 లక్షలతో, పి.వెంకటాపురంలో 58.65 లక్షలతో ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, పైప్‌లైన్ పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నియోజవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా తాగునీటి ఎద్దడి లేకుండా రక్షిత మంచినీటి పథకాలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామాలలో ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. గతంలో తాను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రామదేవు సూర్యాప్రకాశరావు(చిన్నా), పెంకే ఆనందరావు, సోమరాజు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, కొవ్వాడ ఉప సర్పంచ్ తోటకూర శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గుత్తుల సత్తిబాబు, మాజీ కార్పొరేటరు వడ్డి మణికుమార్, పండూరు ఎంపీటీసీ సభ్యుడు నందిపాటి శ్రీనివాస్, ధర్మరాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ సందర్శన

పెనుమర్తి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ కోడ్ నంబరు 153ను సందర్శించిన ఎమ్మెల్యే కన్నబాబు అక్కడ చిన్నారులకు కల్పిస్తున్న సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేసి టీచర్ రత్నంను శాలువాతో సత్కరించారు.

సూర్యారావుపేట గ్రామస్తులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని మత్స్యకార గ్రామం సూర్యారావుపేట గ్రామస్తులు ప్రభుత్వపరంగా లబ్ధి పొందేందుకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. సూర్యారావుపేట గ్రామస్తులతో రమణయ్యపేటలోని వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఉదయం అధికారులు, వలంటీర్ల సమక్షంలో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రజలకు అందుతున్న నవరత్నాలు సంక్షేమ పథకాల గురించి తొలుత సమీక్షించారు. గ్రామస్తులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి గ్రామంలో అభివృద్ధి చేసిన స్థలం నుంచి రెండు రోడ్ల నిర్మాణం ఉన్నందున కొందరికి పట్టాలు వేరే గ్రామంలో కేటాయించవలసి వస్తుందని, దగ్గరలో నేమాం లే అవుట్ ఉన్నందున అక్కడ కొందరికి ఇస్తామన్నారు. మత్స్యకారులు ఎక్కువగా ఉన్న ఈ గ్రామంలో వారికి ప్రయోజనం కలిగేలా చూస్తామని, మత్స్యకార భరోసా ఎవరికైనా రాకుంటే మరోసారి దరఖాస్తు చేసుకోవాలని, వారికి అందేలా చూస్తామన్నారు. వలంటీర్ల పనితీరుపై సమీక్షించి ప్రజలకు మెరుగ్గా సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురార్జీ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, తిమ్మాపురం, నేమాం సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామధేవు చిన్నా, సచివాలయాల మండల కన్వీనరు గీసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెత్త వేస్తే కఠిన చర్యలు

కాకినాడ: ఖాళీ స్థలాలను పరిరక్షించుకోని యజమానులు, చెత్తను స్థలాల్లో వేసే ప్రజల తీరు మారకపోతే తగిన చర్యలు తప్పవని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల స్పష్టం చేశారు. సోమవారం ఆయన కాకినాడ గాంధీనగర్ 38వ డివిజన్ ప్రాంతంలో ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేసే స్పెషల్ డ్రైవ్ ప్రక్రియను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో చెత్తను వేయడం వల్ల అవి డంపింగ్ యార్డుల్లా మారి అక్కడ పందులు, కుక్కలు చేరి అపరిశుభ్ర వాతావరణం కలిగిస్తున్నాయన్నారు. స్థానికులు కూడా అనేక రోగాల బారిన పడాల్సి వస్తోందన్నారు. ప్రజారోగ్యానికి ఇబ్బందిగా మారే అవకాశం ఉన్న 765 స్థలాలను ఇప్పటికే గుర్తించి వాటిని పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 40 మంది కార్మికులను, ఓ వాహనాన్ని ఇందు కోసం ఏర్పాటు చేశామన్నారు. వర్షాలు పడే లోపు ఆయా స్థలాలను పరిశుభ్రం చేయనున్నామన్నారు. శుభ్రం చేసిన స్థలలో మళ్లీ చెత్త వేస్తే వారికి జరిమానాలు విధించి, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. పరిశుభ్రం చేసేందుకు అయ్యే ఖర్చును కూడా వారి నుంచి వసూలు చేస్తామన్నారు. ఆయన వెంట నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి వర్మ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అపూర్వ కలయిక



ఎంఎస్ఎన్ చార్టీస్ 1974- 75 సంవత్సరం విద్యార్థులు

బోట్‌క్లబ్ : ఎప్పుడో కలిసి చదువుకున్న స్నేహితులు ప్రస్తుతం వాట్సాప్, ఫేస్‌బుక్‌ల ద్వారా కలుసుకున్నారు. కాకినాడ ఎంఎస్ఎన్ చార్టీస్‌లో 1974– 75 లో 10 వతరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం స్థానిక హోటల్‌లో కలుసుకున్నారు. దేశ, విదేశాల్లో ఉన్న విద్యార్థులు ఒకచోట కలుసుకొని అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ప్రస్తుతం ఏమీ చేస్తున్నారో అడిగి తెలుసుకుని సంతోషాల్లో మునిగి తేలారు. విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి తోడ్పడిన గురువులను ఈ సందర్భంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించేందుకు సహకరించిన మిత్రులు గోపరాజు, కాండూరి, వెంకటరవి, భీమాల ప్రసాద్, జయదేవ్, భగవాన్, నున్న ఆలీకి కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేషన్ ‘స్పందన’కు 12 అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

కాకినాడ: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల వినతులు స్వీకరించారు. ఆక్రమణలు, పారిశుధ్యం, డ్రైనేజీ నిర్మాణం సహా వివిధ విభాగాలకు సంబంధించి 12 మంది కమిషనర్‌కు వినతులు అందజేశారు. ఆయా విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న వివిధ విభాగాధిపతులను కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యం, వీధి దీపాలు, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఒక్క అర్జీకి నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా దరఖాస్తులు అందజేయవచ్చునని సూచించారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, డీఈలు, ఈఈ లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేద కుటుంబాలలో వెలుగులు

- ఎమ్మెల్యే కన్నబాబు
- కరపలో గడప గడపకూ మన ప్రభుత్వం



కరపలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతోపాటు ఇతర సంక్షేమ పథకాలు పేద కుటుంబాలలో వెలుగులు నింపుతున్నాయని కాకినాడరూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. వివిధ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన లబ్ధిదారుల ముఖాలలో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. అందుకు నిదర్శనంగా ఏ గడపకు వెళ్లినా మహిళలు ఎదురొచ్చి, మద్దతు తెలుపుతూ ఆశీర్వదిస్తున్నారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం నాలుగోరోజు కరపలో స్థానిక నాయకులతో కల్సి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించి, ఎవరెవరికీ ఏయే పథకాల ద్వారా లబ్ధి చేకూరిందీ తెలియజేశారు. కొత్తపేటవీధిలో కొన్ని ప్రాంతాలలో డ్రెయిన్లు, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు తెలుపగా ఎమ్మెల్యే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌ను కోరినట్టు తెలిపారు. ముందుగా వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు మద్దూరి గంగాభవానీ, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, గ్రామకమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, గ్రామ కార్యదర్శి వి.సునీల్‌కుమార్, ఎస్కే నాగేంద్రకుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు స్వాగతం పలకగా, ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తూ, సీఎం జగన్‌ను, తనను ఆశీర్వదించాలని కోరుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయా వీధులలో ఉన్న వీరభద్రుని గద్దెలలో, రామాలయాల్లో ఎమ్మెల్యే కన్నబాబు పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సాదే లోహిదాస్‌కుమార్, పెంకే సత్తిబాబు, నక్కా భద్రం, మద్దూరి భాస్కర్, నక్కా సత్తిబాబు పాల్గొన్నారు.

డీసీఎల్ అక్రమాలపై విచారణ చేయండి

కాకినాడ సిటీ: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆంధ్ర పేపర్ లిమిటెడ్ పరిశ్రమ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకుండా యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు కలెక్టర్ కృతికా శుక్లాను కోరారు. సోమవారం స్పందనలో కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞాపన అందించిన సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. ఆంధ్ర పేపర్ మిల్లు పాత గుర్తింపు సంఘం కాలపరిమితి 2019 డిసెంబర్‌తో ముగిసిపోయిందన్నారు. కాకినాడ డీసీఎల్ 2020 ఫిబ్రవరిలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారన్నారు. ఓటర్ లిస్ట్ కూడా జారీ చేశారన్నారు. అయితే కోవిడ్ కారణంతో ఎన్నికల ప్రక్రియ వాయిదా పడిందన్నారు. పాత గుర్తింపు సంఘం హైకోర్టులో ఎన్నికల నిలుపుదల కోసం రిట్ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. అయితే కోర్టు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోయినా దాదాపు మూడు సంవత్సరాలుగా జిల్లా కార్మికశాఖ అధికారులు ఎన్నికలు నిర్వహించకుండా యాజమాన్యానికి, పాత గుర్తింపు సంఘానికి వత్తాసు పలుకుతున్నారని మధు కలెక్టర్‌కు వివరించినట్లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

కాకినాడ సిటీ: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సోమవారం ధర్నా చౌక్ వద్ద ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు వెంటనే విడుదల చేయాలని కోరారు. గుర్తింపు కార్డులు తక్షణమే మంజూరు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కార్మికులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తాటిపాక మధు, తోకల ప్రసాద్, టి.అన్నవరం, పెద్దిరెడ్ల సత్యనారాయణ, కామిరెడ్డి బోడకొండ, రాజు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పర్యావరణ హిత జీవనంపై అవగాహన



పర్యావరణ హిత జీవన విధానంపై అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: పర్యావరణ హిత జీవన విధానంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు కాకినాడ జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం తెలిపారు. గ్లాస్గోలో జరిగిన కాప్-26 సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (లైఫ్)ను ప్రవేశపెట్టిన ఈ మిషన్‌ను విజయవంతంగా అమలు చేసేందుకు వివిధ శాఖలు సమన్వయంతో, ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఎస్.ఇలక్కియ అధికారులతో కలిసి పర్యావరణ హిత జీవన విధానంపై అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు నా రోజువారీ జీవితంలో సాధ్యమయ్యే అన్ని మార్పులు చేస్తానని, పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యతగురించి నా కుటుంబం, స్నేహితులు, ఇతరులను, నిరంతరం ప్రేరేపించేందుకు కూడా కట్టుబడి ఉంటానని అధికారులు ప్రతిజ్ఞచేశారు. డీఆర్వో కె శ్రీరమణి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎస్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు సర్‌ఆర్థర్ కాటన్‌దొర



సిరిపురంలో కాటన్‌దొరకు నివాళులర్పిస్తున్న రైతులు, నాయకులు

కరప: ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి, ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన సర్‌ఆర్థర్ కాటన్‌దొర చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ నాయకుడు నున్న వీరవెంకట సత్యనారాయణ(వీరబాబు) పేర్కొన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో సోమవారం కాటన్‌దొర జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాటన్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుగుదురు, జి.భావారం, పెద్దాపురప్పాడు గ్రామాల్లోని కాటన్‌దొర విగ్రహాలకు వివిధ పార్టీల నాయకులు, రైతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జేఎన్‌టీయూకేలో..



సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: సర్ ఆర్థర్ థామస్ కాటన్ సేవలు చిరస్మరణీయమని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో సోమవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కాకినాడ లోకల్ సెంటర్ ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ కాటన్ 220వ జయంతి వేడుకలు నిర్వహించారు. స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి, బయోటెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ మాలోతు రమేష్ అధ్యక్షత వహించగా వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, ఇంజినీర్ నాగేశ్వరరావు హాజరై కాటన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ జిల్లా పచ్చని పొలాలతో సస్యశ్యామలంగా వర్ధిల్లడానికి గల కారణం ధవళేశ్వరం వద్ద ఆయన నిర్మించిన బ్యారేజీ అన్నారు. కాకినాడ చాప్టర్ ప్రెసిడెంట్ ఎన్.కృష్ణారావు, కార్యదర్శి వి.కృష్ణారావు, ఇనిస్టిట్యూట్ కార్యదర్శి డాక్టర్ వి.జయప్రసాద్ పాల్గొన్నారు.

సంస్థ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయాలి

బోట్‌క్లబ్: సంస్థ స్థాపించిన వ్యక్తుల ఆశయాలకు అనుగుణంగా కొత్త కమిటీ నడుచుకోవాలని టౌన్‌హాల్ సీనియర్ సభ్యులు, రోటరీ మాజీ గవర్నర్ కేవీఎస్ ఆంజనేయమూర్తి అన్నారు. స్థానిక టౌన్‌హాల్‌లో 146వ వ్యవస్థాపక దినోత్సవ ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహించారు. ఆంజనేయమూర్తి మాట్లాడుతూ 1877లో లిటరరీ అసోసియేషన్ పేరుతో టౌన్‌హాల్ ఏర్పాటు చేశారని, సమాజంలో ఉన్న వివిధ వృత్తుల వారు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు దీనిలో సభ్యులుగా కొనసాగుతున్నారన్నారు. ప్రతి ఒక్కరికి విశ్రాంతి అనేది ఎంతో ముఖ్యమని, విజ్ఞానంతో కూడిన విశ్రాంతి మనిషికి ఎంతో ఆనందాన్ని కలుగజేస్తుందన్నారు. వ్యవస్థాపకులకు క్రమశిక్షణ, అంకితభావం ఉండడం వల్ల నేటికి సంస్థ కొనసాగుతూ సమాజానికి తన వంతు బాధ్యతను నెరవేరుస్తోందన్నారు. ఈ సంస్థలో ఐదు దశాబ్దాలుగా సభ్యునిగా కొనసాగడం గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. కమిటీ అధ్యక్షుడు నానాజీ మాట్లాడుతూ టౌన్‌హాల్ కమిటీ సీనియర్ సభ్యులను సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. టౌన్‌హాల్ కమిటీ కార్యదర్శి పాబోలు చిన్నపున్నయ్య మాట్లాడుతూ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించిన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. భవన నిర్మాణ కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. టౌన్‌హాల్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.